
www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 జనవరి 2023

6

తిరుపతి



పేరూరు వకుళమాత ఆలయంలో చోరీకి యత్నం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పేరూరు బండపైన వకుళమాత ఆలయంలో మంగళవారం రాత్రి చోరీకి ప్రయత్నించారు. ఆలయం వెనుక వైపు కొండ ఎక్కి దుండగులు లోనికి ప్రవేశించారు. గడ్డపారతో హుండీ తాళాలు పగలగొట్టి నగదును మూటగట్టి తప్పించుకునే ప్రయత్నంలో మూట జారి కింద పడిపోవడంతో అలికిడి అయ్యింది. భయభ్రాంతులకు గురైన దొంగ పరారయ్యాడు. గుడిలోకి దొంగ ప్రవేశించిన దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డు అయ్యింది. ఆలయ అధికారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం, వేలిముద్రల నిపుణుల ఆధారాలు సేకరించారు. నగదు మూటను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వేరే ఏమైనా వస్తువులు చోరీకి గురయ్యాయా? అన్న కోణంలోనూ ఎంఆర్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'బుడ్డ' వడ్లు వద్దే వద్దు..!

తెగేసి చెబుతున్న వ్యవసాయ అధికారులు

గోనెసంచుల కోసమూ రైతన్నల నిరీక్షణ

ఆర్‌బికెల్లో విత్తనాలు, ఎరువులు కరువు

ఓ వైపు ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, పండించిన ధాన్యాన్ని ఆర్‌బికెల్లో కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలుకుతోంది.. అయితే పొలాల చుట్టూ మిల్లర్లు తిరుగుతున్నారు తప్ప, వ్యవసాయ అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. మరో వారం రోజుల్లో పంట కోతకు వస్తుంది. కనీసం గోనెసంచులు కూడా రైతన్నల వద్ద లేకుండా పోయాయి. ఆర్‌బికెల్లో విత్తనాలు, ఎరువులు, మందులు ఏవీ లేవని, అన్నీ బహిరంగ మార్కెట్లోనే కొనుగోలు చేయాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. తాము నష్టపోతున్నా, అందరి ఆకలి తీరుస్తున్నామన్న సంతోషమే వారిని బతికిస్తోంది.



గిట్టుబాటు ధర కల్పించండి : అయ్యప్ప, బంగాళా గ్రామం



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. వాటిల్లో వరి నాటాను. పంట కోత దశకు వచ్చింది. రెండు ఎకరాలకు పంట ఖర్చు 50వేల పైనే అయ్యింది. ఇపుడేమో కేజీ వరి పంట ధర రూ.20.40 పైసలని అధికారులు చెబుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. ఏటా పెట్టుబడులు పెరిగి రైతన్నపై భారం పడటం తప్ప గిట్టుబాటు కావడం లేదు.

సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి : గోవిందన్, పిచ్చాటూరు



అరణియార్ ప్రాజెక్టు దిగువన రెండు ఎకరాల భూమి ఉంది. వరి వేశాను. పంట కోయడానికి నాలుగురోజులు సమయం ఉంది. పెట్టుబడులు పెరిగాయి. పంటకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, మందులు అన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ రూపంలో అందిస్తే ఖర్చు తగ్గుతుంది. ఆర్‌బికెల్లో ఏమీ ఉండటం లేదు. రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు

పిచ్చాటూరు మండలంలో చిన్నసన్నకారు రైతులు రబీ సీజన్లో వరి సాగు చేశారు. అయితే అధికారులు ఇంతవరకూ రైతులను సంప్రదించలేదు. ఈ వారంలో వరి కోత కోయడానికి సిద్ధంగా ఉన్నారు. కనీసం గోనెసంచులు సైతం ఇంతవరకూ అందజేయలేదు. సాధారణ వరి క్వింటా రూ.2040 రూపాయలు. 'ఎ' గ్రేడ్ వరి ధర రూ.2060గా ప్రభుత్వం ప్రకటించింది. అంటే కేజీ 24-26 రూపాయలు ధర పలుకుతోంది. బహిరంగ మార్కెట్లో కేజీ బియ్యం రూ.50-100 చొప్పున అమ్ముతున్నారు. వ్యవసాయ అధికారులు పంట నమోదు లెక్కల్లో 1440 ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు తెలిపారు. వాస్తవానికి 1800 ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు రైతులు చెబుతున్నారు. రాత్రనకా, పగలనకా నాలుగు నెలల పాటు ఆరుగాలం శ్రమిస్తే దళారులు, రైస్‌మిల్లు యజమానులు పొలం చుట్టూ తిరుగుతున్నారు. రైతులతో ముందస్తుగా కొంత డబ్బును అడ్వాన్స్‌గా ఇచ్చి దగ్గరుండి మరీ పంటను కోసుకుని తీసుకెళ్లడానికి సిద్ధమవుతున్నారు. దళారులు రైతుల దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని మిల్లర్‌తో కొట్టించి 25 కేజీల బియ్యం బస్తాలుగా మార్చి, ఒక్కో బస్తా 950-1170 రూపాయలకు బహిరంగ మార్కెట్లో అమ్ముకుంటారు.

ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో పంటను కొంటామని చెబుతున్నారు, రంగు మారినా కొంటామని బహిరంగసభల్లో ప్రకటనలు చేస్తున్నారు. తీరా చిన్నసన్నకారు పేద రైతులు పండించిన వరి పంటకు మాత్రం అనేక షరతులు విధిస్తున్నారు. 'బుడ్డ' వడ్లు కొనేది లేదని తెగేసి చెబుతున్నారు. మిగిలిన ధాన్యమైనా కొంటారంటే తేమ శాతం 17 మించకూడదు. అలా మించితే వాటినీ కొనరు. అధికారులు విధించిన షరతులు పరిశీలిస్తే కోసిన వరి పంటను రాళ్లుండకూడదు, గడ్డిపీచులు ఉండరాదు, తేమ శాతం ఉండరాదు. పూర్తిగా ఎండి ఉండాలంటూ కొర్రీలు పెడుతూనే ఉన్నారు. అధికారులు స్పందించి బుడ్డ వడ్లు కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, షరతులు లేకుండా పంట కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొత్తరకం విత్తనాలు అందించాలి

రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీతో కొత్తరకాలైన డిపిటి విత్తనాలను అందించకపోవడంతో ప్రైవేట్ దుకణాల్లో బుడ్డ వరి నాటుతున్నాం. అధికారులు మాత్రం ప్రభుత్వ ఆదేశాల మేరకు బుడ్డ వరి ధాన్యాన్ని కొనుగోలు చేయలేమని చెబుతున్నారు. చేసేది లేక దళారులను నమ్మి తక్కువ రేటుకు అమ్ముకుంటున్నాం. రైతు భరోసా కేంద్రాల్లో కొత్త రకాలైన వరి ధాన్యాన్ని రైతులకు సబ్సిడీతో అందించాలి.

అనుమతి రాలేదు : సంజీవరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి



ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ మాకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేస్తాము. అవి కూడా చిన్న, పెద్ద, బుడ్డ వరి ధాన్యాన్ని కొనుగోలు చేయలేము. సాధారణ, ఎర్ర మల్లెలు, సుబ్బయ్య బుడ్డలు, ఏ గ్రేడ్ సాంబ మసూరి, నెల్లూరు మసూరి, తెలంగాణ సోనా ఇవి మాత్రమే కొనుగోలు చేస్తాము. ఒక క్వింటాల్‌కి 'ఏ' గ్రేడ్ 2060, సాధారణ ఒక క్వింటాలు ధర 2040 రైతులకి ప్రభుత్వం కల్పిస్తుంది. ప్రస్తుతానికి రైతు భరోసా కేంద్రంలో ఎటువంటి విత్తనాలు, ఎరువులు, మందులు లేవు. ముందస్తుగా ఆర్డర్లు పెడితే తెప్పిస్తాం.



సిపిఎస్ రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నష్టం చేసే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధించాలని రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరణకు దశల వారి ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ ఉద్యమంలో ఉద్యోగ ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యుటిఎఫ్, పిడిఎఫ్, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన అభ్యర్థులను 2023 లో జరగబోయే గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎమ్మెల్సీ లుగా గెలిపించుకోవడం ద్వారా, ప్రజాతంత్ర హక్కులని కాపాడుకుందాం అని యుటిఎఫ్ తిరుపతి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. యుటిఎఫ్ తిరుపతి జిల్లా కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది .ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాధారణ నిరసన కార్యక్రమం చేయడానికి కూడా వీలులేని పరిస్థితులు ఈరోజు రాష్ట్రంలో ఉన్నాయని ,ఉద్యోగ ఉపాధ్యాయుల యొక్క కనీస హక్కుల్ని ప్రభుత్వం నెరవేర్చడం లేదని విమర్శించారు. విద్యారంగంలో విలీనం పేరుతో పాఠశాలల, ఉపాధ్యాయుల పోస్టులను కుదింపు చేస్తున్నారని విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు ఉద్యోగ ఉపాధ్యాయలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ప్రభుత్వం సంపూర్ణంగా నెరవేర్చలేదని తెలియజేశారు . మెరుగైన పిఆర్సి, సకాలంలో డిఏలు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులైజేషన్, 30 వేల ప్రమోషన్లు ,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ ఇలాంటివి ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ, ఉద్యోగ హక్కుల కోసం నిలబడి మనతో కలిసి పోరాటాలు చేసే వారు, ఉద్యమ అభ్యర్థులు అయిన తూర్పు రాయలసీమ టీచర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి. బాబు రెడ్డి , గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి అలాగే ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ అభ్యర్థి కే రమాప్రభలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ సిపిఎస్ ని రద్దు చేయకుండా జిపిఎస్ అనే మరో నూతన విధానాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని , సిపిఎస్ జిపిఎస్ ఏ విధానమైనా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉపయోగం లేనిదని తెలిపారు. పిఎఫ్, ఏపీజిఎల్ఐ 1800 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎస్ నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి బదిలీలకోడ్ ని తీసుకురావాలని, దాని ద్వారానే బదిలీలు , ప్రమోషన్లు నిర్వహించాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటి సభ్యులు కె. సదాశివ రెడ్డి మాట్లాడుతూ గత పిఆర్సి సందర్భంగా ఏడు డీఏల బకాయిలు నగదు రూపంలో చెల్లించాల్సి వున్నదని, అలాగే బకాయిగా ఉన్న రెండు డి ఎ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ. జె.రాజశేఖర్, కె ముత్యాల రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె శేఖర్, కోశాధికారి పి రమేష్ నాయుడు, జిల్లా కార్యదర్శులు జి శ్రీనివాసులు, రామ్మూర్తి, ఎ హరిబాబు, ఏ పద్మజ, కె ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం కుమారస్వామి, దేవరాల నిర్మల, ఆడిట్ కమిటీ కన్వీనర్ సి సురేష్, సభ్యులు కే శివకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె భాస్కర్, ఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, ఆరోపణలపై కౌన్సిల్లో రచ్చరచ్చ

కమిషనర్ పెళ్లికి ఎవరి ఖర్చు వారిదే : ఎంఎల్ఎ

అజెండాలో అన్ని అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిపై టిడిపి నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, అభివృద్ధి చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని వైసిపి కార్పొరేటర్ ఆర్.వెంకటేష్ అన్నారు. కమిషనర్ పెళ్లికి కార్పొరేటర్లు ఎవరి ఖర్చు వారే భరించుకోవాలని, ఢిల్లీ టూర్‌తో ఎటువంటి సంబంధం లేదని ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి కౌన్సిల్ సమావేశం ఎస్వీయూ సెనెట్ హాల్లో బుధవారం జరిగింది. టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని తాను వ్యక్తిగతంగా ఆరోపించడం లేదని, ప్రజలు రకరకాలుగా ఆరోపణలు చేస్తున్నారని ప్రస్తావించారు. ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి ఎక్కడా గంజాయి అమ్మకాలు చేయడం లేదని, ఆయనపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే గంగమ్మ గుడి వద్దకు వచ్చి ప్రతిజ్ఞ చేస్తామని సవాల్ విసిరారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ ఆర్‌సి మునికృష్ణ కార్పొరేటర్‌గా గెలవడానికి కారణం వైసిపియేనని అన్నారు. ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి కనుసైగ చేసి ఉంటే ఆర్‌సి మునికృష్ణ గెలిచేవాడు కాదన్నారు. టిడిపిలో జరిగిన అవినీతి తమ ప్రభుత్వ హయాంలో



జరగలేదన్నారు. మూడున్నరేళ్లలో ఏం చేశామో ప్రజలకు తెలుసన్నారు. ఆర్‌సి మునికృష్ణ మాట్లాడుతూ ప్రజలు ఓట్లు వేసి తనను గెలిపించారని అన్నారు. ఈ రెండు అంశాలపైనే కౌన్సిల్లో దాదాపు వాగ్వివాదాలతో రసాభాసగా జరిగింది.

వైసిపి కార్పొరేటర్ శాలినిరెడ్డి మాట్లాడుతూ తన డివిజన్‌లో మురుగుకాల్వలు తీయడానికి ఆరోగ్యాధికారి జేసీబీ పంపలేదన్నారు. వైసిపి కార్పొరేటర్ ఎస్‌కెబాబు మాట్లాడుతూ గతంలో ఆరోగ్య అధికారికి అన్ని అధికారాలు ఉండేవని, ఇపుడు లేకపోవడం వల్లనే అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. కమిషనర్ జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలన్నారు.

పెళ్లికి, స్టడీటూర్‌కు సంబంధం లేదు : ఎంఎల్ఎ

కమిషనర్ అనుపమ అంజలి పెళ్లి ఈనెల 27వ తేదీ ఢిల్లీలో జరగనుంది. 50 మంది కార్పొరేటర్లతో పాటు ఐదుమంది కోఆప్షన్ సభ్యులు ఢిల్లీకి విమానంలో వెళ్లనున్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఇప్పటికే టికెట్లు బుక్ చేశారని తెలుస్తోంది. ఈ ఖర్చు కార్పొరేటర్ల స్టడీటూర్‌లో కలిపేందుకు ప్రయత్నాలు చేయగా పత్రికల్లో వార్తలు రావడంతో ఈ విషయమై ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి స్పందించారు. కమిషనర్ పెళ్లికి, కార్పొరేటర్ల ఢిల్లీ టూర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. కమిషనర్ పెళ్లికి కార్పొరేటర్లు తమ సొంత నిధులతో వెళతారని, స్టడీటూర్ ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఉంటుందన్నారు. దీనిపై రాజకీయం చేయడం తగదన్నారు. కౌన్సిల్ సమావేశంలో మాస్టర్‌ప్లాన్ రోడ్ల విస్తరణలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయించిన నిధులు ఆమోదం పొందాయి. అజెండాలో ఉన్న అన్ని అంశాలు ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

దేశంలోనే పెద్ద మురికినీటి శుద్ధి కేంద్రం

తిరుపతిలో ప్రారంభించిన ఎంఎల్ఎ భూమన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి వినాయకసాగర్ పక్కన ఐదు ఎంఎల్‌డిల మురికినీటి శుద్ధి కేంద్రాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఒక వైపు నుండి డ్రైనేజి నీరు ఇంతకు మునుపు వినాయకసాగర్లోకి చేరడం జరిగేదని, ఇప్పుడు మురికినీటి శుద్ధి కేంద్రం వినియోగంలోకి రావడం వలన రోజుకి 50లక్షల లీటర్ల మురికి నీటిని వివిధ దశల్లో శుద్ధిపరిచి పూర్తి స్థాయిలో మంచినీటిగా మార్చి వినాయకసాగర్ కు తరలించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వినాయకసాగర్ నిండిన తరువాత మిగులు నీటిని వ్యవసాయానికి మళ్లిస్తారన్నారు. దేశంలోనే అతి పెద్ద 5 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన మురికినీటి శుద్ధి కేంద్రాన్ని తిరుపతిలో నిర్మించడం అభినందనీయమన్నారు. నగరంలో వెలువడే మురికినీటిలోనే ఇంతకు మునుపు వినాయక నిమజ్జనం జరిగేదని, ఇకపై శుద్ధి చేసిన నీటిలోనే నిమజ్జనం జరుగుతుందన్నారు. తిరుపతి నగరపాలకసంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ స్మార్ట్ సిటి నిధులతో సుమారు 14 కోట్ల ఖర్చుతో రోజుకి 50 లక్షల లీటర్ల మురికినీటిని శుద్ధి చేసి మంచినీటిగా మార్చడం జరుగుతుందన్నారు. భూగర్భ జలాలు చాల వరకు కలుషితం కాకుండ కాపాడడంలో ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్లాంట్ గురించి ఎస్.ఈ మోహన్, కాంట్రాక్టర్ భానోదయ్య రెడ్డిలు వివరిస్తూ ప్లాంట్ లోకి వచ్చిన మురికి నీటిని ఏఏ దశల్లో శుద్ధి చేయడం జరుగుతుందనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటి సభ్యులు ఎస్.కె.బాబు, కార్పొరేటర్లు ఆదం రాధాకష్ణా రెడ్డి, అనీల్ కుమార్, రామస్వామి వెంకటేశ్వర్లు, హనుమంత నాయక్, నారాయణ, ఆంజినేయులు, తిరుపతి మునిరామిరెడ్డి, యస్.ఈ. మోహన్, డి.ఈ. విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు

తలకోనలో 'మహాశివరాత్రి' ఏర్పాట్లపై సమీక్ష



ప్రజాశక్తి-యర్రావారిపాలెం

శివరాత్రికి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈవో జయకుమార్, తహశీల్దార్ దస్తగిరయ్య ఆదేశించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయం నందు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కార్యనిర్వహణ అధికారి జయ కుమార్ అధ్యక్షతన మండలంలోని అన్ని శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకమండలి సభ్యులు, సిబ్బంది అందరూ కలిసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. శానిటేషన్, తాగునీరు, విద్యుత్‌లైట్లు, పోలీసు బందోబస్తు, ఆర్టీసీ బస్సుల రవాణా, వాహనాల పార్కింగ్, వ్యాపారాలు నిర్వహించే అంగళ్లు, వైద్యసౌకర్యం తదితర వాటిపై ఎంపిడిఒ అమరనాథ్ అధికారులతో సమీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు.

తలకోనకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. గుడి ఆవరణం నుంచి ఐదు కిలోమీటర్ల మేర విద్యుత్, మైకులు, అడవిపై ప్లాస్టిక్, నిప్పు పడకుండా అడవి సంరక్షణపై ఫారెస్టు అధికారులు, ఎలక్ట్రికల్ ఎఇ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రవికుమార్, నెరబైలు సెక్రటరీ, ఎలక్ట్రికల్ ఎఇ పాల్గొన్నారు.

24 వరకు జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు

క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో కాపాడాలి : కలెక్టర్



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, యాక్సిడెంట్లలో గాయపడిన క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లోపు ఆసుపత్రులలో చేర్పించి ప్రాణాలు కాపాడడం అందరి బాధ్యతని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. కోర్టులకు తిరగాల్సిన భయం ఇప్పుడు లేదని , పైగా పురస్కారం లభిస్తుందని జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయలని జిల్లా కలెక్టర్ కె.వెంకటమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రోడ్డు భద్రత,యాక్సిడెంట్ల నివారణ చర్యల పై నేషనల్ హైవే , ఆర్ అండ్ బి అధికారులు, డ్రైవర్లు, హెల్త్, పోలిస్, డి ఎల్ డి ఓ, రవాణా శాఖ అధికారులతో కలసి సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేసారు.

కలెక్టర్ మాట్లాడుతూ వారోత్సవాలను "స్వచ్ఛత పఖ్వాడ-యువశక్తిద్వారా సామాజిక మార్పు" అనే నినాదంతో చేపడుతున్నామని అన్నారు. పుత్తూరు -నాయుడుపేట రహదారుల పనులు పురోగతిలో ఉన్నాయని, ప్రమాదకర మలుపుల వద్ద భద్రతా పరమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలలో చాలా మందికి రహదారి నియమావళి పై అవగాహన లేకపోవడం, డ్రైవర్ల అవగాహన లోపం, బాధ్యత రాహిత్యం వలన చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ద్విచక్ర వాహన ప్రయాణంలో విధిగా హెల్మెట్ ధరించడం , ఫోర్ వీలర్ ప్రయాణంలో సీటు బెల్టు ధరించడం తప్పనిసరని, నిర్లక్ష్యంగా వ్యవహరించినచో జరిమానాలు విధించాలని అన్నారు. రహదారి ప్రమాదాలలో టూ, ఫోర్ వీలర్ మరణాల సంఖ్య ఎక్కువగా ఉన్నదని, నిబంధనల మేరకు కఠినంగా రోడ్డు భద్రతా నియమావళి అములు చేయాలన్నారు. రాత్రివేళ జాతీయ రాష్ట్ర రహదారులపై ఎట్టిపరిస్థిల్లో వాహనాలు నిలపరాదని, ఇవి రహదారి ప్రమాదాలకు ముఖ్య కారణమవుతున్నాయని అన్నారు. తప్పనిసరిగా అన్ని వాహనాల వెనుక వైపున రేడియం స్టిక్కర్ ఏర్పాటు చేసుకునేలా సంబంధిత రవాణా శాఖ, పోలీసు అధికారులు చూడాలని ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గుడ్ సమారిటన్ స్కీం కింద ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సకాలంలో గోల్డెన్ హవర్ లో ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేసి ఆసుపత్రులకు తరలించిన వారికీ ప్రోత్సాహకంగా రూ.5 వేలు అందించబడుతుందని, ప్రతి పౌరుడూ భాద్యతతో వ్యవహరించి ప్రమాద బాదితులకు అండగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ భద్రత వారోత్సవాలకరపత్రాలను విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి సీతారాం రెడ్డి, ట్రాఫిక్ డిఎస్పి విజయ్, డి.ఎల్.డి.ఓ సుశీల దేవి పాల్గొన్నారు.

షార్‌లో ఆత్మహత్యల కలకలం

ఉరేసుకున్న ఎస్ఐ వికాస్‌సింగ్ భార్య




ప్రజాశక్తి - సూళ్లూరుపేట

శ్రీహరికోట షార్‌లో సిఐఎస్ఎఫ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వికాస్‌సింగ్ సర్వీసు రివాల్వర్‌తో సోమవారం రాత్రి కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. మంగళవారం అర్ధరాత్రి భర్తను చివరిసారి చూడటానికి శ్రీహరికోటకు వచ్చిన భార్య ప్రియాంక సింగ్ అర్ధరాత్రి నర్మదా గెస్ట్‌హౌస్‌లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ఆర్థిక సమస్యలు, కొడుకు అనారోగ్యమే కారణమని తెలుస్తోంది.

ఎస్ఐ వికాస్‌సింగ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బీహార్ వాస్తవ్యుడు. మూడు నెలల క్రితమే శ్రీహరికోటలో ఎస్ఐగా చేరారు. కంట్రోల్‌రూమ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అతనికి ముగ్గురు పిల్లలు. ప్రస్తుతం వీరు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నారు. సోమవారం వేర్వేరు చోట్ల కానిస్టేబుల్ చింతామణి చెట్టుకు ఉరేసుకోవడం, ఎస్ఐ వికాస్‌సింగ్ సర్వీస్ గన్‌తో కాల్చుకుని చనిపోవడం, మరుసటిరోజే వికాస్‌సింగ్ భార్య ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో షార్‌లో విషాదం నెలకొంది. వచ్చి మూడు నెలలు కూడా నిండకుండానే ఎస్ఐ వికాస్‌సింగ్ దంపతుల బలవన్మరణంపై తోటి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల్లోనే ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడం షార్‌లో ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జ్యూయలరీ షాపు ప్రారంభించిన కిలివేటి



ప్రజాశక్తి - సూళ్లూరుపేట

పాండురంగ స్వామి ఆలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్యూయలరీ బంగారు ఆభరణాల షోరూమ్‌ను ఎంఎల్ఎ కిలివేటి సంజీవయ్య బుధవారం ప్రారంభించారు. చెన్నయ్, తిరుపతి, నెల్లూరు వంటి పెద్ద నగరాలకు ధీటుగా బంగారు ఆభరణాలను అందుబాటులోకి తెచ్చారు. వివాహాది శుభకార్యాలకు పెద్ద నగరాలకు వెళ్లకుండా సూళ్లూరుపేట పరిసర ప్రాంత ప్రజలు బంగారు ఆభరణాలను సరసమైన ధరలకు కొనుగోలు చేసుకునే వెసులుబాటును సూళ్లూరుపేట జ్యూయలరీ షాపు వారు కల్పిస్తున్నారన్నారు. వెండిపై బంగారుపూత వేసిన ఆభరణాలనూ అందుబాటులోకి తెచ్చారు. అలాగే డైమండ్ ఆభరణాలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అధునాతన డిజైన్లు అందుబాటులోకి తెచ్చారు. లైట్‌వెయిట్ బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ చిన్ని సత్యనారాయణ, వైసిపి నేతలు జెట్టి వేణుయాదవ్, కౌన్సిలర్ మిజురు రామకృష్ణారెడ్డి, ఆంజనేయస్వామి ఆలయ ట్రస్టు అధ్యక్షులు అయిత శ్రీధర్, వైసిపి నేతలు అలవల సురేష్ పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలతో మానసికోలాసం కలుగుతుందని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా నగరి మున్సిపాలిటీ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన హెచ్‌డీ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుదుపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బుధవారం బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేసుకోవాలి

ప్రజాశక్తి -పాలసముద్రం: మండల పరిధిలోని గర్భిణులు నెలసరి వైద్యపరీక్షలు తప్పక చేసుకోవాలని సూపర్వైజర్ సుశీల తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్యపరీక్షను ఆమె పరిశీలించారు. సూపర్వైజర్ సుశీల మాట్లాడుతూమాతా శిశు మరణాలు అరికట్టాలంటే గర్భిణులు ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయించుకోవాలని సూచించారు. రక్తపరీక్ష అయిన తరువాతే వైద్యపరీక్షలు చేసుకోవాలని తెలిపారు. అలాగే గర్భిణులు పండ్లు, పాలు, కూరగాయలు వంటి పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు విధిగా వేయించాలని హెచ్చరించారు. అనంతరం గర్భిణులకు బిపి, షుగర్ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాధా, గంగా గౌరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రానికి భయపడే ప్యాలెస్‌కే సీఎం పరిమితం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: కేంద్రం ప్రభుత్వం ఆధీనంలో ఉన్న సీబీఐ, సీఐడీ కేసులకు భయపడి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ పరిమితమయ్యారని జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు అన్నారు. గంగాధర నెల్లూరు అన్నక్యాంటీన్‌లో 95 వరోజు సందర్భంగా టిడిపి నేతలు బుధవారం 150 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ టిడిపి వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, నెల్లెపల్లి మాజీ ఎంపిటీసీ సుబ్రమణ్యం, టిడిపి మండల అధ్యక్షుడు స్వామిదాస్, నీరజాక్షులురెడ్డి, బుజ్జిబాబు, ఆర్ముగం, రాజేంద్రన్, శంకర్ , కమల్ పాల్గొన్నారు.

ఎల్‌ఏ సాగరంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేటలోని ఎల్ ఏ సాగరంలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన 'కిలివేటి సంజీవయ్యకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపికా, కౌన్సిలర్ రవిబాబు, నాగార్జున, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మునిసిపల్ వైస్ ఛైర్మన్ జలదంకి వెంకట కష్ణారెడ్డి, కుమార్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, నాయుడుపేట సీఐ సి.హెచ్.ప్రభాకర్‌రావు, కౌన్సిలర్లు షబ్బీర్, అశోక్, రాజా రెడ్డి, వెంకటరమణారెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సవాలలో అవకాశం కల్పించండి

ప్రజాశక్తి- తొట్టంబేడు: తమకు శివరాత్రి ఉత్సవాల్లో శ్రీ వేమాలమ్మ నాట్యమండలి తరపున కోలాటం, భజన చేయడానికి అవకాశం కల్పించాలని పూడి దళితవాడ వాసులు బుధవారం శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డికి అవకాశం కల్పించాలని వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నరసింహానాయుడు, బుజ్జిరెడ్డి, నాగరాజు, తాళ్లూరు మురళి, సాయి ప్రసాద్, బాలు హరీష్, చెంగయ్య భజన గురువు చిన్న ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోకండి



ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలో భూములకు పట్టాలిప్పిస్తామని పేదల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న దళారులను నమ్మి మోసపోకండని తహసీల్దారు అజ్మీత్తులఖాన్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ సిబ్బందితో గయ్యాళి భూములపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది భూములకు పట్టాలు ఇప్పిస్తామని నగదు వసూలు చేయడం జరుగుతున్నట్లు తమ దష్టికి వచ్చిందని.. అటువంటి వారిని నమ్మకండన్నారు. అర్హత కలిగి ఉన్న వారికి మాత్రమే సాగు చేసుకున్న భూములకు పట్టాలు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మధ్యవర్తిగా ఏర్పాటు చేసుకోవడంతో పేదలకు నష్టం జరుగుతుందన్నారు. నేరుగా తమ వద్దకు వచ్చి మీ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని సచివాలయం.. సిబ్బందితో గ్రామీణ ప్రాంతాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులైన వారికి భూములకు పట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణేష్, సర్వేయర్ శరత్, వీఆర్వో ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడలతోనే మానసికోల్లాసం



ప్రజాశక్తి-రేణిగుంట: జాతీయ యువజన వారోత్సవాలలో భాగంగా రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో మంగళవారం నెహ్రూ యువ కేంద్రం చిత్తూరు, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు, గుత్తివారిపల్లి సర్పంచ్ మంజుల పోటీలను ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

నటసార్వభౌముడికి నివాళులు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సందర్భంగా మంగళం పంచాయతీలో తిరుపతి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కష్ణమూర్తిరెడ్డి, ఈశ్వరయ్య, గోపీనాథ్, శీను, శ్రీధర్, హేమలత, వాణి, ధనమ్మ, కత్తి సుధా, అజీజ్ భాష, సురేష్ నాయుడు, భాస్కర్ రెడ్డి, గోవిందరాజు, రవిచంద్ర, అల్లా భాష, మాతయ్య, రామ్మూర్తి యాదవ్, చలపతి, బాలాజీ, సూరి, రవి, కుల్లాయప్ప, రామకష్ణ, సిద్ధారెడ్డి, బుజ్జి ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ, తిరుపతి రూరల్ మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: స్వర్గీయ నందమూరి తారక రామారావు 27వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కార్వేటినగరం కూడలి వద్ద పుత్తూరు పట్టణం, రూరల్ మండలాల టీడీపీ ఆధ్వర్యంలో నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ.నందమూరి తారక రామారావు తెలుగు ప్రజలకు పరిచయం అక్కరలేని పేరు అన్నారు. సినీ, రాజకీయ రంగాలను శాసించి తెలుగువాడి ఆత్మగౌరవాన్ని దశ దిశలా వ్యాపింపచేశారన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ఒక శకం అన్నారు. కార్యక్రమంలో. పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, చిత్తూరు పార్లమెంటరీ టీఎన్‌టీసీ అధ్యక్షులు రావిళ్ల మాధవనాయుడు, రాష్ట్ర యువత మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, టీడీపీ జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు చెంచయ్య, గాలి గోపీనాథ్, బీసీసెల్ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షులు వేలు, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, గుర్రప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాయపల్లి: దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు బడుగు బలహీన వర్గాల గుండెల్లో నేటికీ



చెరగని ముద్ర వేసుకున్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి అన్నారు. బుధవారం 26వ వర్ధంతి వేడుకలను బాలాయపల్లిలో ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు, కొరపాటి రామచంద్రనాయుడు, సత్యంనాయుడు, సీవీకేఎన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్వర్గీయ నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి వేడుకలను బీఎన్‌కండ్రిగలో బుధవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, నెలవాయి ఎంపిటీసీ మనోహర నాయుడు, సుందరయ్య, సముద్రాల సుధాకర్‌నాయుడు, శ్రీనివాసులు, రమేష్ బాబు, భాస్కర్ యాదవ్, రవి, రమణయ్యాయాదవ్, ఉషారాణి, సుబ్బారావు, పెంచలయ్య, వెంకటాచలం, ఈశ్వయ్య, ధనంజయులు నాయుడు, రాజేంద్ర, రవి, మురళీ, మణి, వెంకటయ్య, మునిరాజ్‌నాయుడు, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిన టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు బాటలో నడుద్దామని మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బొజ్జల బందమ్మ, తిరుపతి పార్లమెంటు మహిళా విభాగం అధ్యక్షురాలు చక్రాల ఉష సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ 27వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక భరద్వాజతీర్థం అంబలిస్వామి ఆశ్రమం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ముందుగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రేణుక, శ్రీలక్ష్మి, చంద్రమని, సరోజ, త్రివేణి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు మండల కేంద్రంలో టీడీపీ మండలాధ్యక్షుడు నైనారు పొన్నారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 27వ వర్ధంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళులు అర్పించి పేదలకు అన్నదానం చేశారు. చెవిరెడ్డి శివాజీరెడ్డి, మునిరంగారెడ్డి గురవారెడ్డి, సుబ్రమణ్యం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: ఎన్టీఆర్ 27వ వర్ధంతిని బుధవారం పట్టణంలోని ఎంబీ రోడ్డులో టీడీపీ నాయకుడు పోతుగుంట విజయ్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు, మాజీ ఎంపీటీసీ ధనపాల్, కేవీపీఎస్ డైరెక్టర్ సుమన్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ గోపి, దయాలన్, సుబ్రహ్మణ్యం, రవియాదవ్, సదాశివ, చాను, మేఘనాథ్, పోతుగుంట క్రిష్ణ, టైల్స్ సుధ, సంఘనాథ్, రమేష్, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: తారక రామారావు 27 వ వర్ధంతి ని పురస్కరించుకొని తిరుపతి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో టౌన్ క్లబ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి



నివాళులు అర్పించారు. అనంతరం కపిలతీర్థం వద్ద ఉన్న తిరుపతి టీడీపీ కార్యాలయంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గ పరిశీలకులు వెంకటేష్, సురేంద్ర కుమార్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ , టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ , కార్పొరేటర్, ఆర్‌సీ మునికష్ణ, టిడిపి నగర అధ్యక్షులు చిన్నబాబు, ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, టిడిపి మాజీ నగర అధ్యక్షులు దంపూరి భాస్కర్ యాదవ్, డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, సూరా సుధాకర్ రెడ్డి, ఊక విజయ్ కుమా,ర్, బుల్లెట్ రమణ,ష్ణ యాదవ్, టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పులిగోరు మురళీకష్ణ రెడ్డి, మబ్బు దేవ నారాయణ రెడ్డి జేబీ శ్రీనివాస్ కంకణాల రజనీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

తొట్టంబేడు: ఇలగనూరు పంచాయతీలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27వ వర్ధంతిని మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళీనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, భాస్కర్ నాయుడు, మాజీ సర్పంచ్ భాస్కరయ్య, మునిరత్నం, మధు నాయుడు, తాతయ్య, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ వ్యవస్థాపక వ్యవస్థాపకులు ఎన్టీఆర్

క్యాంపస్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏకైక మహిళా విశ్వవిద్యాలయాన్ని తిరుపతిలో స్థాపించిన గొప్ప వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడైన నందమూరి తారక రామారావు 27 వ వర్ధంతిని యూనివర్సిటీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మమత , డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ గీతా వాణి, ఇంజినీర్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు ఉచితంగా సిమెంట్ పంపిణీ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం బట్టీకండ్రిగ ఏఎం పురం గ్రామంలోని 25 మంది నిరుపేద ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా 700 సిమెంటు బస్తాలు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా పంపిణీ చేశారు. అలాగే పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.30 లక్షలతో మంజూరైన డ్రైనేజీ, సిమెంట్ రోడ్లు, పైపులైన్ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి, వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మి, పుత్తూరు ఎంపీపీ మునివేలమ్మ. వైస్ ఎంపీపీలు, ఎంపిటీసీలు, సర్పంచులు, కమిటీ ఛైర్మన్లు, సభ్యులు, వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పరిశోధనా విద్యార్థి భాగ్యలక్ష్మి గ్రూప్-1లో ఎంపిక



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర పరిశోధనా విద్యార్థి జి.భాగ్యలక్ష్మి టీఎస్పీఎస్సీ గ్రూప్-సర్వీస్‌లో ప్రిలిమినరీ పరీక్ష పాస్ అయ్యి మెయిన్ పరీక్షకు సెలెక్ట్ అయ్యారు. వివాహం అయిన తరువాత డిగ్రీ, పీజీ పూర్తి చేసి తనపిల్లలతో పాటు తను కూడా చదువుతూ అంచలంచెలుగా ఎదిగారు. వారి పిల్లలు, అమ్మాయి డాక్టర్ కోర్సులో చేరితే, అబ్బాయి ఇంజినీరింగ్ చదివారు. వారితో పాటు భాగ్యలక్ష్మి మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ రెసిడెన్సియల్ డిగ్రీ కాలేజిలో లెక్చరర్‌గా టీఎస్పీఎస్సీ పరీక్షలో ఎంపికై ఉద్యోగం చేస్తున్నారు. ఆర్థిక శాస్త్రంపై ఉన్న మక్కువతో పీహెచ్‌డీ 2022 లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నందు చేరారు. నిరంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతూ అక్టోబర్ 2022 లో జరిగిన టీఎస్పీఎస్సీ గ్రూప్-1లో మెయిన్ పరీక్షకు సెలెక్ట్ అయినందుకు భాగ్యలక్ష్మి ను పరిశోధన పర్యవేక్షకురాలు డా.పి.మాధవి, డిపార్ట్‌మెంట్ హెడ్ డా.పి.నీరజ, డా.ఎమ్.పద్మావతి అభినందించారు.

దొంగ ఓట్లతోనే చంద్రబాబు గెలుపు

సాక్ష్యాధారాలతో పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: కుప్పంలో ఇంతకాలం చంద్రబాబునాయుడు దొంగ ఓట్లతోనే ఇన్నాళ్లు గెలుస్తూ వచ్చారని ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వెల్లడించారు. తమిళనాడువాసులను సైతం ఇక్కడ ఓటర్లుగా చేర్చారని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ దొంగ ఓట్లతోనే భారీ మెజార్టీ వచ్చినట్లు చూపించేవాడని విమర్శించారు. రెండు లక్షల 20వేల ఓట్లు ఉన్నట్లు పాత రికార్డులు చెబుతున్నాయని, వాస్తవానికి లక్షా 83వేల ఓట్లే ఉన్నాయని తెలిపారు. ప్రతి ఆధార్‌కార్డును ఓటు కార్డుతో అనుసంధానం చేసినపుడు స్పష్టంగా ఈ విషయం అర్థమయ్యిందన్నారు. బిజిలాపురం కుమార్, శీనన్న లాంటి వేలాదిమంది తమిళనాడులో ఓటు కలిగి ఇక్కడా ఉన్నారని తెలిపారు. ఇలాంటివి వేలాదిగా ఉన్నాయని చెప్పారు. బోగస్ ఓటర్లపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గతంలో ఫిర్యాదు చేసినపుడు కొన్ని తొలగించారన్నారు. చంద్రబాబు పూర్తి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని, అనవసరంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు. త్వరలోనే హంద్రీనీవా జలాలను కుప్పంకు తెప్పిస్తామన్నారు.

జీవో నంబర్.7ను వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రిటైర్డ్ పెన్షనర్లను ఇక్కట్ల పాల్జేస్తున్న ఈకేవైసీ జీవో నంబర్.7ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీ లోపు విశ్రాంత పెన్షనర్లు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆదేశించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం జీవో జారీ చేసే నాటికి పట్టుమని పది రోజులు కూడా గడువులేదని, పైగా పండగ సెలవులన్నారు. ఈ క్రమంలో ఊర్లకు వెళ్లిన వద్దులు హడావిడిగా ఎలా ఈకేవైసీ పూర్తి చేసుకుంటారని ప్రశ్నించారు. ప్రభుత్వ స్పందించి ఈకేవైసీ జీవో నుంచి విశ్రాంత ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

పోషకాహారంతోనే అధిక పాలదిగుబడి

ప్రజాశక్తి -పాలసముద్రం : పోషక విలువ కలిగిన పదార్థాలతోనే పాడి పశువులకు అధిక పాలు దిగుబడి వస్తుందని పశువైద్యాధికారి యశస్వి తెలిపారు. బుధవారం పాలసముద్రం రైతు భరోసా కేంద్రం ఆవరణలో పాడి పశువులకు ఉచిత వైద్యపరీక్ష నిర్వహించారు. పాడి పశువులకు గాలికుంటు టీకాలు వేసుకోవాలని తెలిపారు. చాలామంది పాడి రైతులు ఏకాల వేసుకోవడం వల్ల పాలదిగుబడి తగ్గుతుందని వేసుకోవడం లేదని తెలిపారు. టీకాలు వేయించడం వల్ల పాలు దిగుబడి తగ్గదని తెలిపారు. పాడి పశువులను రెండు రోజులకు ఒకసారి మంచి నీటితో స్వర్గంగా కడిగి ఉంచాలని తెలిపారు. పాడి పశువు ఆరోగ్యం బాగుంటేనే పాలలో కూడా వెన్నశాతం పెరుగుతుందని సూచించారు. అనంతరం పాడి పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రంలోని సచివాలయాన్ని తహాశీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించి హాజరును చూసి సిబ్బందికి పలు సూచనలను అందజేశారు. ప్రజల నుండి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, సకాలంలో విధులకు హాజరు కావాలని ఆదేశించారు. దివ్యభారతి, వీఆర్వో శ్రీజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో వైద్యసేవలు అందించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సామాజికపరంగా అందరూ బాగుండాలంటే వైద్యపరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యపరంగా బలంగా ఉండేటట్టు చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉన్నదని అందరూ నిర్ణయించిన ప్రకారం తమతమ విధులు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో వైద్య ఆరోగ్యపరంగా తీసుకుంటున్న చర్యల మీద పూర్తిస్థాయిలో రివ్యూ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనీమియా సమస్యలు లేకుండా చూడాలని, అలా ఉన్న వారిని గుర్తించి వారికి సరైన వైద్యం ఆహారం అందించాలన్నారు. ప్రధానంగా మహిళలు గర్భిణీస్త్రీలు చిన్నపిల్లల్లో ఇటువంటి లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, వారి ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తున్న డాక్టర్లు ఇటువంటి లక్షణాలున్న వారిని గుర్తించి వారికి సరైన ఆహారం వైద్యం అందించేలా అంగన్వాడీ, వైద్య సిబ్బందిని ఆదేశించాలన్నారు. అలాగే జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని, సీజన్లో వచ్చే సమస్యలను దష్టిలో పెట్టుకుని వారికి మంచి ఆహారం వైద్యం అందించి ఆరోగ్యంగా ఉండేటట్లు చూడాలన్నారు. ఏట్టి పరిస్థితుల్లోనూ మరణాలు జరగకూడదని వారి ఆరోగ్యం ఆహారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రత్యేక శ్రద్ధలు తీసుకుంటుందని క్షేత్రస్థాయిలో అమలు అయ్యేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉన్నదని అన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఆరు నుంచి ఏడు మంది ప్రజల ఆరోగ్యం కోసం పనిచేయడం జరుగుతోందని ప్రతి 2000 మందికి వీరు ఉంటున్నారని ప్రజల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. వీలైనంతవరకు ప్రభుత్వ ఆసుపత్రిలోని సుఖప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏదైనా రిస్క్ వస్తే వెంటనే వారిని పై ఆసుపత్రికి పంపాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కాన్పు అయిన తర్వాత కూడా వారి ఆరోగ్యం పట్ల నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రకాశం, డిఐఓ రవిరాజు, డిసిహెచ్ఎస్ బీసీ కే నాయక్, డిఐఎంఓ శ్రీనివాసరావు, ఆర్‌బిఎస్‌కే కోఆర్డినేటర్ సుదర్శన్, ఆరోగ్యశ్రీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఓ రమేష్ రెడ్డి, డిపిహెచ్ఎన్ఓ రేణుక ప్రభ, ఐసిడిఎస్ పిడి నాగ శైలజ తదితరులు పాల్గొన్నారు.

టిటిడి ఉద్యోగి ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: టిటిడి ఉద్యోగి ఇంట్లో 120 గ్రాముల బంగారం, 1500 గ్రాముల వెండి నగలతో పాటు, ఐప్యాడ్, నగదు అపహరించిన ఘటన జరిగింది. అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీ, ఎస్‌ఎల్‌వి నగర్ రెండో వీధిలో నివాసం ఉంటున్న ఉద్యోగి సంక్రాంతి పండుగకు సొంతూరైన చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల గ్రామానికి వెళ్లారు. శనివారం వెళ్లిన వీరు బుధవారం ఉదయం తిరిగి తిరుపతికి విచ్చేశారు. తలుపులు తెరచి ఉండటాన్ని గమనించిన కుటుంబం చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అలిపిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫింగర్‌ప్రింట్, క్లూస్ టీం చేరుకుని ఆధారాలను సేకరించారు. బాధితుడి తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఈవోను కలిసిన ఫ్యాప్టో నాయకులు



ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖాధికారిని కలిశారు. ఈనెల 9వ తేది ఫ్యాప్టో నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని జిల్లాలో ఉపాధ్యాయ సమస్యలపై చర్చలకు ఫ్యాప్టో నేతలను ఆహ్వానించాలని కోరారు. రెండు సంవత్సరాల పాటు ఫ్యాప్టో పాలకవర్గం ఉటుందని విద్యరంగ సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలపై చర్చలు ఫ్యాప్టో నేతలను ఆహ్వానించాలని కోరారు. ఫ్యాప్టో ఛైర్మెన్ మునాఫ్, కార్యదర్శి హేమాద్రి, కోశాధికారి గోపినాథ్, కో ఛైర్మెన్ మునిర్ అహ్మద్, కో ఛైర్మెన్ రామమూర్తి, డిప్యూటీ కార్యదర్శి జివి రమణ, డిప్యూటీ కార్యదర్శి దేవరాజులురెడ్డి, కిరణ్‌కుమార్, రమేష్‌లను ఆహ్వానించాలని కోరారు.

పేదల గోడు ప్రభుత్వానికి పట్టడం లేదు

ప్రజాశక్తి- పలమనేరు: బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న తమ బిడ్డకు పింఛన్ నిష్కారణంగా తొలగించారని బాధితులు మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డికి బుధవారం మొర పెట్టుకున్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయనకు ఈసందర్భంగా వారి గోడు వెళ్ళబోసుకున్నారు. పలమనేరు మున్సిపల్ పరిధిలోని 24వ వార్డుకు చెందిన శీనా, శోభాల కుమారుడు నవీన్(18) బుద్ధిమాంద్యంతో బాధ పడుతూ ఉండడంతో ఇప్పటిదాకా పింఛన్ అందుతూ ఉండేది. అయితే తమకు ఇల్లు సాకుగా చూపుతూ ఆ పింఛన్‌ను తొలగించునున్నట్లు నోటీసులు అందించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి పెద్దదిక్కైన శీనా సైతం గుండెజబ్బుతో బాధపడుతున్నాడని, దీంతో శోభా కష్టపడితే గానీ కడుపు నింపుకునే పరిస్థితి లేదంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నవీన్‌కు వస్తున్న పింఛన్ సొమ్ము కుటుంబానికి కాస్త ఆసరాగా ఉండేదని ఇప్పుడు దాన్ని తొలగించేశారని కంటతడి పెట్టారు. దీనిపై అధికారులకు విన్నవించిన పరిశీలిస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మాజీమంత్రి ఇలాంటి నిజమైన లబ్ధిదారులకు పెన్షన్ తొలగించడం చాలా బాధాకరమని అధికారులు స్పందించి వెంటనే బాధితులకు పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆర్వి బాలాజీ, టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆర్బిసి కుట్టి, గిరిబాబు, మైనార్టీ నాయకులు ఖాజాపీర్, బ్రహ్మయ్య, చాంద్ బాషా, నాగరాజరెడ్డి, నదీం పాల్గొన్నారు.

నవరత్నాలతోనే రాష్టాభివృద్ధి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నవరత్నాలతోనే రాష్ట్రఅభివద్ధి సాధ్యమని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని సెట్టేరి సచివాలయం పరిధిలోని తుంపైనపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపగడపకు వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్లెట్ ద్వారా వారికి అందుతున్న సంక్షేమ ఫలాలను తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నవరత్నాల పథకాన్ని ప్రారంభించి ప్రతి పేదవాడు అభివద్ధి చెందే విధంగా అన్ని సంక్షేమ పథకాలు ప్రారంభించి బడుగు బలహీన వర్గాల వారిని ఆదుకున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, జడ్పిటిసి సోమశేఖర్, తహశీల్దార్ బెన్‌రాజ్, ఏఈలు గురువారెడ్డి, శ్రీధర్, గుణశేఖర్ రెడ్డి, ఏపీవో కిరణ్, సర్పంచ్ మహేంద్ర రెడ్డి, సుమన్‌రెడ్డి , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు తృతీయ స్థానం

ప్రజాశక్తి - రామకుప్పం: ఈనెల 14న విజయవాడలోని విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్- 18 బాలుర షూటింగ్ బాల్ పోటీలలో చిత్తూరు జిల్లా జట్టు తతీయ స్థానం సాధించిందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిఇఓ మురళీకష్ణ, చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. ఈవిజయాన్ని మదనపల్లి బిటి కాలేజ్ పిడి స్వర్గీయ గిరిరావుకి అంకితం చేస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ కార్యదర్శి నరేష్ బాబు తెలిపారు. క్రీడా కారులను పలువురు అభినందించారు.